# ఎవరికి వారే.. యమునా తీరే..

- హుస్నాబాద్ కాంగ్రెస్‌లో లుకలుకలు
- టికెట్ నాకంటే నాకంటూ పోటీ పడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్
- నియోజకవర్గంలో పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్న ఇరువర్గాలు
- ఏ వైపుకు వెళ్లాలో దిక్కుతోచని పరిస్థితిలో పార్టీ క్యాడర్
- అధిష్ఠానం..నాయకుల వైఖరికి విసిగి వేసారి ఇతర పార్టీవైపు మొగ్గుచూపుతున్న కాంగ్రెస్ నాయకులు..?



ఆరు గ్యారెంటీలపై ప్రచారం చేస్తున్న మాజీ పొన్నం ప్రభాకర్‌గౌడ్



కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో తన ప్రచార రథాలకు పూజలు చేయిస్తున్న అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

హుస్నాబాద్, అక్టోబర్ 25 : హుస్నాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పరిస్థితి ఎవరికి వారే.. యమునా తీరే.. అన్న చందంగా మారింది. టికెట్ నాకొస్తుందంటే నాకొస్తుందంటూ ఇరువురు నాయకులు పోటాపోటీగా కార్యకర్తలు, నాయకులను కూడగట్టుకునే యత్నం చేస్తున్నారు. రెండు నెలలుగా కాంగ్రెస్ అధిష్టానం హుస్నాబాద్ టికెట్‌ను ఖరారు చేయకపోవడం, ఇద్దరు నాయకులు పోటా పోటీగా ప్రచారాలు సైతం మొదలు పెట్టడంతో ఏ వైపుకు వెళ్లాలో తెలియని స్థితితో పార్టీ క్యాడర్ ఉంది. కొందరు కార్యకర్తలు, నాయకులు టికెట్ ఖరారయ్యాక అభ్యర్థి వైపు వెళ్దామని చూస్తుంటే మరికొందరు ఏం చేయాలో తోచక ఇతర పార్టీల వైపు మొగ్గు చూపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుండడం, క్యాడర్ మొత్తం నిర్లిప్తంగా ఉండటంతో పార్టీలోని లుకలుకలు బయటపడుతున్నాయి.

పార్టీ టికెట్ తనకే వస్తుందనే ధీమాతో నాలుగు నెలల క్రితమే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం మొదలు పెట్టారు. ఎమ్మెల్యేగా 2009 నుంచి 2014వరకు ఐదేండ్లు సేవ చేశానని, కార్యకర్తలకు అండగా ఉన్నాననే ధీమాతో ఆయన ప్రచారానికి శ్రీకారం చుట్టారు. దాదాపు అన్ని మండలాలను చుట్టివచ్చారు. ఇటీవల హుస్నాబాద్ టికెట్ తనకే వస్తుందని, పార్టీ అధిష్టానం హుస్నాబాద్ నుంచి పోటీ చేయాలని పంపించిందంటూ హుస్నాబాద్ పట్టణానికి మకాం మార్చిన పొన్నం ప్రభాకర్ రాకతో సీన్ మొత్తం మారిపోయింది. నియోజకవర్గంలో అసలుకే అంతంత క్యాడర్ ఉన్న కాంగ్రెస్‌కు వీరిరువురి వర్గపోరు తారాస్థాయికి చేరడంతో ఉన్న క్యాడర్ కూడా బయటికి రావడం లేదనే విమర్శలున్నాయి. ఒక టర్మ్ ఎంపీగా చేయడం తప్ప హుస్నాబాద్ నియోజకవర్గానికి ఎలాంటి సంబంధం లేని పొన్నం ఇక్కడికి రావడం ప్రవీణ్‌రెడ్డి వర్గానికి మింగుడు పడడం లేదు. 2018ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరిన ప్రవీణ్‌రెడ్డి కేవలం పార్టీ టికెట్ కోసమే మళ్లీ కాంగ్రెస్‌లో చేరాడని, ఆయనకు పార్టీ అధిష్టానం టికెట్ ఇచ్చే పరిస్థితి ఏమాత్రం లేదనేది పొన్నం వర్గీయుల ధీమా. అయినా ఎవరి ప్రయత్నం వారు చేసుకుంటున్నట్లు సమాచారం.

**పోటాపోటీగా ప్రచారం రథాలు**

ప్రవీణ్‌రెడ్డి, పొన్నం ఇద్దరూ పోటాపోటీగా ప్రచార రథాలను సైతం సిద్ధం చేసుకుంటున్నారు. పార్టీ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తూ ఆధిపత్యాన్ని చాటుకునే యత్నం చేస్తున్నారు. పొన్నం ఇప్పటికే తన ప్రచార రథాలను సిద్ధం చేసి పూజలు చేయగా, తాజాగా ప్రవీణ్‌రెడ్డి భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో ప్రచార రథాలకు పూజలు చేయించారు. టికెట్ ఆశిస్తున్న ఇద్దరు నాయకులు హుస్నాబాద్ పట్టణంలో ఇల్లు, కార్యాలయం కోసం ఇండ్లను అద్దెకు తీసుకున్నారు. పొన్నం ఇక్కడికే తన నివాసాన్ని మార్చి నిత్యం మార్నింగ్ వాక్, ప్రెస్ మీట్లు అంటూ ప్రచారం చేస్తున్నారు. పాత క్యాడర్‌ను కలుస్తూ మనకే టికెట్ వస్తుందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఏఐసీసీ ప్రతినిధి ఎదుటే హుస్నాబాద్ పట్టణంలో జరిగిన ర్యాలీలో ఒకవర్గంపై మరో వర్గం దాడులకు పాల్పడ్డారంటే వీరిద్దరి మధ్య ఎంత వర్గపోరు నడుస్తుందో విదితమవుతుంది. వీరిద్దరికి సంబంధించిన ప్రచార రథాలు హుస్నాబాద్ పట్టణంతో పాటు గ్రామాల్లో తిరుగుతూ ప్రచారం చేస్తుంటే వీరిలో ఎవరు కాంగ్రెస్ అభ్యర్థి అంటూ జనం ముక్కున వేలేసుకొని చూడడం గమనార్హం.

**అయోమయంలో నాయకులు, కార్యకర్తలు**

పార్టీ అధిష్టానం టికెట్ ఖరారు చేసేదెప్పుడు.. అభ్యర్థి ఎవరనేది తేలేదెప్పుడో తెలియక పార్టీ నాయకులు, కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. ఈ లోపు ఉన్న కొద్దిపాటి పార్టీ క్యాడర్ కూడా ఎవరి దారి వారు చూసుకుంటున్నట్లు సమాచారం. దీంతో హుస్నాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి దయనీయంగా...ప్రశ్నార్థకంగా మారిందని చెప్పొచ్చు. వీరిద్దరి ఆధిపత్య పోరు బీఆర్‌ఎస్‌కు మరింత కలిసొస్తుందని.. గులాబీ జెండా మూడోసారి రెపరెపలాడడం ఖాయమని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు.



తిమ్మాపూర్‌లో యువకులకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రసమయి

# అభివృద్ధిని చూసే చేరికలు

- నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరాలి
- మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి రసమయి బాలకిషన్

తిమ్మాపూర్, అక్టోబర్ 25: నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశామని, ఆ అభివృద్ధిని చూసే కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారని బీఆర్‌ఎస్ మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ స్పష్టం చేశారు. బుధవారం తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి, నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీకి చెందిన యువకులు, నాయకులు పెద్దసంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి తిమ్మాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన బీఆర్‌ఎస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల గ్రామాలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్ది అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామాల అభివృద్ధిని చూసి ప్రతి ఒక్కరూ బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీతో అభివృద్ధి జరగదన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త సన్నద్ధం కావాలని కోరారు. అనంతరం పలువురికి నియామక పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు.

మైనార్టీ సెల్ మండల ఉపాధ్యక్షుడిగా మహ్మద్ నబీ, యూత్ మండల ఉపాధ్యక్షుడిగా కోతి నరేశ్, యూత్ మం డల ప్రధాన కార్యదర్శిగా సంగాల పవన్, విద్యార్థి విభాగం మండల ఉపాధ్యక్షుడిగా గొట్టిపర్తి మధూకర్‌ను నియమిస్తూ ఉత్తర్వులను అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్‌ను కలిసిన మున్సిపల్ మాజీ చైర్మన్



ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసిన సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు



మున్సిపల్ మాజీ కడవేర్గు రాజనర్సుకు స్వీటు తినిపిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబర్ 25: సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు తన పుట్టిన రోజు సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా వారి ఆశీస్సులు తీసుకున్నారు.

**మొక్కలు నాటిన నాయకులు**

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 25 : సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు పుట్టిన రోజు సందర్భంగా సిద్దిపేట కుమ్మరి సంఘం నేత కట్కూరి రవీందర్, సంఘం నాయకులతో కలిసి బుధవారం 10 మొక్కలు నాటారు.ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు సూచనలతో సిద్దిపేటను రాజనర్సు గొప్పగా అభివృద్ధి చేశారన్నారు.

## కురుమలు అన్నిరంగాల్లో ముందుండాలి

- కురుమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు నగేశ్



అలయ్ బలయ్‌లో కురుమ సంఘం నేతలు

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 25 : కురుమలు అన్ని రంగాల్లో రాణించాలని కురుమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు నగేశ్ అన్నారు. సిద్దిపేటలో కురమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోరే ఎల్లయ్య ఆధ్వర్యంలో బుధవారం అలయ్ బలయ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కురుమల ఆరాధ్యదైవం బీరప్పదేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నగేశ్ మాట్లాడుతూ సిద్దిపేటలో ఐదేండ్లుగా అలయ్ బలయ్ జరుపుతున్నామన్నారు. కురుమలందరూ ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. కురుమల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ పెద్దపీట వేస్తున్నదన్నారు. కురుమల అభివృద్ధికి ప్రతి నిత్యం కృషి చేస్తానన్నారు. పార్లమెంట్ లోకల్ బాడీ ఎన్నికల్లో కురుమ అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిందం రాజమలయ్య, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశం, కురుమ సంఘం జిల్లా కార్యదర్శి కంతుల రమేశ్, యువత జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, రాయుడు, రాములు కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పకడ్బందీ చర్యలు చేపట్టాలి

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 25 : విధి నిర్వహణలో ఎలాంటి అవరోధాలు లేకుండా పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డిస్టిక్ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్ బృంద ప్రధాన అధికారి అయోధ్య రెడ్డి, ఇతర అధికారులు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ప్రిసైడింగ్, సెక్టోరియల్ అధికారులకు వీవీ ప్యాట్ మిషన్, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ సాధారణ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్ల వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పోలింగ్‌కు ముందు మాక్ పోలింగ్ విధానం, ఈవీఎం, వీవీ ప్యాట్ కనెక్షన్లు, బ్యాలెట్ యూనిట్ల సెట్టింగ్‌ను తనిఖీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్వోలు, ఎలక్షన్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**TELECALLERS కావలెను**

★శ్రీ సిద్ధి వినాయక వెంచర్స్: 1st Ward, ఔరంగాబాద్, మెదక్ మున్సిపాలిటీ వారికి తెలుగు/హిందీలో వాక్చటుత్వమున్నవారు Walk in Interview attend కాగలరు. 9440494780.
NT-310185

**WANTED**

★రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.